


నాది ఒకరితో కలిసే స్వభావం కాదు. అలాగని నాకు మనుషుల పొడ గిట్టక పోదు. నాకు నేనై కల్పించుకుని ఎవరితోటీ మాట్లాడను. ఎరుగున్న వాళ్ళు ఎదురైనా వాళ్ళు నన్ను చూడకపోతే నేను కూడా చూడకుండా పోవడానికే ప్రయత్నిస్తాను. నలుగురు కలిసి మాట్లాడుకుంటూంటే చూస్తూ ఆనందించగలను కానీ నేనూ వారిలో ఒకణ్ణిగా కలిసిపోలేను. ఈ కారణాలవల్ల మనుషుల మధ్య మసలుతూనే నేను మనుషులకు దూరంగా ఉంటున్నాను.

నాకు వివాహమైనా నా స్వభావంలో మార్పు రాలేదు. నా భార్య కూడా నా లాంటిదే. మే మిద్దరం కూర్చుంటే చాలా కబుర్లు పుట్టుకొస్తాయి. మా యిద్దరికీ ఒకరిపట్ల ఒకరికి మంచి ఆకర్షణ ఉంది. అవగాహన ఉంది. అయితే మూడో మనిషి వస్తే మా యిద్దరికీ యిబ్బందే! అట్టే మాటలు నడవ్వు.

మా యిద్దరిదీ యించుమించి ఒకే స్వభావం కావడం వల్ల మే మిద్దరం బాగా కలిసి తిరుగుతూండే వాళ్ళం. సి ని మా లు, పార్కులు, పిక్‌నిక్‌లు వగైరా ఎన్నో కార్యక్రమాలు మా ఇద్దరికి మాత్రమే పరిమితమై ఉండేవి. సరిగ్గా చెప్పాలంటే మే మిద్దరం ఒకే మనిషిలా జీవిస్తున్నాం.

ఇంతగా తిరిగే మేము స్నేహితులను సందర్శించకపోవడం, స్నే హ పూ ర్వ క ఆహ్వానాలు అందించక పోవడం చాలామందికి నచ్చేది కాదు. మా ఆఫీసులో ఉద్యోగులు నన్ను గురించీ, మా వీధిలోని మహిళలు శ్రీమతి గురించీ చాటుమాటున చెవులు కొరుక్కునేవారు. వాళ్ళ పరోక్షపు విసుర్లను బట్టీ, సమాజ న్యాయాన్ని బట్టీ ఈ విషయాన్ని మేము గుర్తించగలిగినప్పటికీ మా బలహీనతని సరిదిద్దుకోలేక పోయాము.

ఒక పర్యాయం మా పక్కింటి వీరభద్రం గారికి జ్వరం వచ్చింది. ఇంట్లో ఆయన, భార్య— ఇద్దరు చిన్న పిల్లలు మాత్రం ఉన్నారు. ఆయనకు జ్వరం వచ్చిన సంగతి నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. ఎందుకంటే వీధిలో కబుర్లలో శ్రీమతి పాల్గొనదు.

సాధారణంగా జ్వరం వస్తే చుట్టుపక్కల వాళ్ళను పరామర్శించడం చాలామందికి రివాజు. నాకు అలాంటి అలవాటు లేదు. అలా వెళ్ళడానికి మొహమాటంగా కూడా ఉంటుంది. అందుకే ఆయనకు జ్వరం వచ్చిందని తెలిసినా ఊరుకున్నాను.

అయిదార్రోజుల తర్వాత ఓ సాయంత్రం వాళ్ళ పెద్దబ్బాయి ఆరేళ్ళవాడు మా ఇంటికి వచ్చి—ఓసారి వాళ్ళింటికి రమ్మనమనికోరాడు. ఆ కుర్రాడు నాకు రోజూ సాయంత్రం తటస్థపడుతూంటాడు. ఎవరూ గమనించని పక్షంలో నేను చిన్న పిల్లలతో సరదాగా ఆడుకుంటూంటాను. అలా వాణ్ని రెండుమూడుసార్లు మా యింటికి పిలిచాను నేను. చిన్న పిల్లలతో అయితే నాకెంతో ఫ్రీగా ఉంటుంది.

నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి పరిస్థితి ఘోరంగా ఉంది. ఆయన ఇంకా నీరసంగానే కనిపిస్తున్నాడు. ఆయన శ్రీమతి వళ్ళు తెలియని జ్వరంతో పడి ఉంది. అత్తగారికి టెలిగ్రాం ఇప్పించడం కోసం ఎవర్నయినా పిలవమని ఆయన కొడుక్కు చెప్పాడుట. వాడు నన్ను పిల్చుకువచ్చాడు. నన్ను చూడ్డంతోనే ఆయన ముఖం మరింత చిన్నదైపోయింది. నావల్ల ఆ మాత్రం సాయం జరుగుతుందని ఆయనకు అనిపించినట్లు లేదు.

నేను అసలు విషయం తెలుసుకున్నాక పరిస్థితి అర్థం చేసుకున్నాను. ఈ పరిస్థితుల్లో వీళ్ళు ఒంటరిగా ఉండడానికి వీల్లేదు. వెంటనే శ్రీమతిని పిల్చుకువచ్చాను. శ్రీమతి వాళ్ళ పరిస్థితి చూసి కంగారు పడింది. తను వాళ్ళకు సాయం ఉంటాననీ నన్ను వెళ్ళి డాక్టర్ని పిలుచుకు రమ్మననీ చెప్పింది.

"ముందు పోస్టాఫీసుకి వెళ్ళి టెలిగ్రాం ఇవ్వండి" అంటూ వీరభద్రం నీరసంగా మూలిగాడు.

నేనాయన మాటలు వినిపించుకోలేదు. తిన్నగా వెళ్ళి నాకు తెలిసిన డాక్టర్ని పిల్చుకు వచ్చాను. డాక్టరువచ్చి రోగులిద్దర్నీ గమనించి వైద్యం గురించి సూచించి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత నుంచీ ఒక వారం రోజులు ఆ కుటుంబాన్ని మా కస్టడీలో ఉంచాము. పిల్లలు శ్రీమతి దగ్గరే పడుకునేవారు. వంటంతా ఆమే చూసుకునేది. మందులు, పళ్ళు వగైరాలు నేను చూసుకునేవాణ్ణి. ఒక

## మార్పు

వారం రోజుల్లో ఆ దంపతులిద్దరూ కోలుకున్నారు.

"మీరు మా అత్తగారికి టెలిగ్రాం ఇచ్చి ఉంటే మీకు ఇంత శ్రమ ఉండేది కాదు" అన్నాడు వీరభద్రం మా సేవలకు నొచ్చుకుంటూ.

"ఇందులో శ్రమేముందండీ! మీకీమాత్రం సాయపడగలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మీ అత్తగారికి టెలిగ్రాం ఇవ్వడం నాకిష్టంలేదు. బోలెడు డబ్బు ఖర్చుపెట్టుకుని ఆవిడ ఇక్కడికి వచ్చేసరికి మీ అవసరం గడిచిపోతుంది. మధ్యతరగతి సంసారాల్లో ఇలా ఇరుగు పొరుగే ఒకర్నొకరు ఆదుకోవాలి" అన్నాను.

ఆయన చాలా సంతోషించాడు. మందులు, పళ్ళు వగైరాలకు అయిన ఖర్చు తిరిగి ఇచ్చేశాడు. నేను అభ్యంతర పెట్టలేదు. మధ్యతరగతి కుటుంబాల్లో డబ్బు విషయంలో మొహమాటా లుండకూడదు. అందువల్ల ఇరుపక్షాలకు ఇబ్బందేనని నా అభిప్రాయం.

ఈ సంఘటనతో మా వీధిలో నాకు మంచి పేరు వచ్చింది, అందుకు మేముచేసిన

### కేన్సరు కురుపుల చికిత్స

కేన్సరులో తీవ్రమైన కేన్సరు మరొకటుంది. దీనిని డ్రగ్ రెసిస్టెంట్ కేన్సరు అని అంటారు. ఈ రకం కేన్సరు కణాలు చురుకుగా పని చేసి మందు ప్రభావాన్ని తగ్గిస్తాయి. ఈ రకం కేన్సరును చికిత్స చేసే విధానాన్ని యిటీవల టోక్యోలో జరిగిన ఒక సింపోజియంలో వెల్లడించారు. కేన్సరు మందులను కాల్షియం యాంటోగనైజర్‌తో లేక కాల్మొడ్యులిన్ ఇన్హిబిటర్‌తో కలిపి సంయుక్తంగా వుపయోగించి! యీ కణాలను చంపవచ్చునని తెలియ చేశారు. ఈ రకం కేన్సరు కణాలు సాధారణ కేన్సరు కణాల కంటే డజను రెట్లు తీవ్రతరమైనవి. కేల్షియం యాంటగనైజర్లు ఈ కణాల చురుకుదనాన్ని తగ్గిస్తాయి. అందువలన కేన్సరు మందులు పని చేయుటానికి అవకాశం ఏర్పడుతుంది.

సేవకంటే వీరభద్రం చేసిన ప్రచారం ముఖ్య కారణం. ఇప్పుడు మాకు వీరభద్రంతో మంచి దోస్తీ ఏర్పడింది. అతను కుటుంబంతోసహా తరుచుగా మా ఇంటికి వచ్చి వెడుతూండేవాడు. వచ్చినప్పుడల్లా మేము బాగా మర్యాదలుచేసి పంపుతూండేవాళ్ళం.

ఈ సంఘటనతో మాకు పేరుతెచ్చిపెట్టి ఉండవచ్చునుకానీ మా ప్రవర్తనలో మార్పును మాత్రం తీసుకురాలేక పోయింది. వీరభద్రం వచ్చి వెడుతున్నందుకు ఆనందంగానే ఉండేది కానీ మేము అతనింటికి వెళ్ళేవాళ్ళం కాదు. ఆయన మరీ అంతగా నొక్కిస్తే "పక్కపక్క వాళ్ళం ఎవరు ఎవరింటికి వెడితేనేం?" అనేవాళ్ళం. ఆదేమిటో మే మిద్దరం కలిసి బయట అడుగు పెడితే స్నేహితుల ఇళ్ళకు వెళ్ళబుద్ధి వేసేదికాదు. ఏ సినిమాకో పోవాలనిపించేది.

అయితే ఈ విషయంలో వీరభద్రం మనసు బాధ పడకుండా ఉండడం కోసమని నేనూ, శ్రీమతీ కలిసి ఒక నిర్ణయం తీసుకున్నాము. వీరభద్రం పిల్లల పుట్టిన తేదీలు తెలుసుకుని ఆ తేదీల్లో మా అంతట మేమే పనిగట్టుకు వాళ్ళింటికి వెళ్ళి ఓ మాంచి బహుమతి కూడా ఇచ్చేవాళ్ళం.

"మిగతా రోజుల్లో మీ ఇంటికిరావాలంటే మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించాలి" అని నేను నవ్వుతూ చెప్పాను. ఆ దంపతులిద్దరూ కూడా మా మనస్తత్వాన్ని సానుభూతితో అర్థం చేసుకున్నారు.

వీరభద్రం మా యింటికి కనీసం రెండు వారాలకొక పర్యాయం వచ్చేవాడు. ఒక పర్యాయం మాత్రం రెండు నెలలు గడిచినా రాలేదు. నేను కంగారుపడి విషయం అడిగాను. తనకూ తెలియదంది శ్రీమతి.

మర్నాడు ఇద్దరం కలిసి వాళ్ళింటికి వెళ్ళాం.

"ఈ రోజు మా పిల్లల్లో ఎవరిదీ పుట్టినరోజు కాదు" అన్నాడు వీరభద్రం.

"తెలుసు. మా ప్రవర్తన అంత సులభంగా మారదు. కానీ మీ ప్రవర్తనలో హఠాత్తుగా మార్పు వస్తే కంగారు పడి పనిగట్టుకు వచ్చాం" అన్నాను.

"మేము కూడా మీకులాగే ఆహ్వానం లేకుండా ఎవరింటికీ వెళ్ళకూడదనుకుంటున్నాం" అన్నాడు వీరభద్రం సీరియస్‌గా.

"అయితే ఆహ్వానించడానికె వచ్చాం. ఇప్పుడే రండి" అన్నాను.

ఆ రాత్రి వాళ్ళు మా యింట్లోనే భోం చేశారు.

ఆ తర్వాత వాళ్ల రాకపోకలు మళ్లీ మామూలయ్యాయి. కానీ ఆ తర్వాత వాళ్లె ప్పుడైనా రావడం ఆలస్యమైతే మేము ప్రత్యేకంగా ఆహ్వానించేవాళ్లం కాదు. అయినా ఇప్పటికి వాళ్ళు మా స్వభావాన్ని బాగా ఆకళింపు చేసుకోగలిగారు కాబట్టి తప్పుపట్టే వారు కాదు. వాళ్లను సంవత్సరానికి రెండు రోజులు మాత్రం మేము ప్రత్యేకంగా ఆహ్వానించేవాళ్లం. వాళ్ల ఇద్దరి పిల్లల పుట్టిన రోజులకూ తప్పక వాళ్లింటికి వెళ్లే వాళ్లం.

వీరభద్రం అందరివద్దా మమ్మల్ని పొగుడుతూండేవాడు. మాకు మంచి పేరు రావడానికి ఎంతవరకూ సహకరించిందో తెలియదు కానీ ఆయనొక్కడే నాకిలాంటి స్నేహితుడిగా ఉన్నాడు.

అప్పట్లో వీరభద్రం గవర్నమెంట్ ఆఫీసులో ఆఫీసర్‌గా ఉండేవారు. నేను ప్రయివేట్ కంపెనీలో గుమాస్తాని. ఆర్థికంగా వాళ్లే మా కంటే ఉన్నత స్థాయిలో ఉండేవారు. అయినా ఆ తేడా కనిపించకుండా ప్రవర్తించేవాడు వీరభద్రం. మా పరిచయం ఎంత గాఢంగా ఉన్నా నేను మాత్రం ఎటువంటి ఇబ్బంది పరిస్థితుల్లోనూ ఆయన్ని అప్పు అడగలేదు. ఇంకా నేనే ఆయనడిగితే ఒకటి రెండుసార్లు చిన్న మొత్తాలు అప్పుగా ఇచ్చాను.

ఇలా మా పరిచయం రెండు మూడేళ్ళు కొనసాగాక ఆఫీసులో ఏదో గొడవొచ్చి నా ఉద్యోగం ఊడింది. మూడు నెలల జీతం ఇచ్చి నన్ను పొమ్మన్నారు. రెండు రోజుల పాటు నేను, శ్రీమతి దుఃఖసముద్రంలో మునిగిపోయాం. అప్పటికి నాకో కొడుకు. వాడికి రెండేళ్ళు. ప్రస్తుతం శ్రీమతి కడుపుతో ఉంది.

విషయం వీరభద్రానికి ఆలశ్యంగా తెలిసింది. ఆ దంపతులు పరుగెత్తుకుంటూ మా ఇంటికి వచ్చి నిష్ఠూరంగా మాటలాడారు. ఆపదలో ఆదుకోనివాడు స్నేహితుడెలాగౌతాడు—అని అన్నాడు వీరభద్రం. తన పలుకుబడినుపయోగించి ఆ కంపెనీలో మళ్లీ ఉద్యోగం వేయిస్తానన్నాడు వీరభద్రం.

వీరభద్రం వల్ల ఆ పని అవుతుందో కాదో నాకు తెలియదు. కానీ కొన్ని కారణాల వల్ల నేనందుకు అంగీకరించలేదు. నా సమస్యలను నేనే స్వయంగా పరిష్కరించుకోవాలని నాకుంటుంది. ఎదుటి వాళ్ల జోక్యం నాకిష్టముండదు. తర్వాత ఆ కంపెనీలో ఓ అధికారితో నాకు పడడంలేదు. మళ్లీ ఉద్యోగం వచ్చినా నాకక్కడ దినదినగండంగా ఉంటుంది. ఒకసారి నన్ను పనిలోంచి తీసివేసిన ఆ కంపెనీలో మళ్లీ చేరడం నాకిష్టం లేదు. అది నా అహానికి దెబ్బ!


అందువల్ల వీరభద్రాన్ని నే నొకటే సహాయం కోరాను— తన పలుకుబడితో ఏదైనా బ్యాంకు లోను ఇప్పించగలిగితే చూడమని ఆయన సంతోషంగా అంగీకరించాడు. ఆ విధంగా నా చేతిలోకి పదివేలరూపాయలు వచ్చాయి. ఆ డబ్బుతో ఓ చిన్న కిరాణా దుకాణం ఆరంభించాను. ఒక సంవత్సర కాలంలో ఆ దుకాణం నిలదొక్కుకో గలిగింది. నెల నెలా బ్యాంకు లోను వాయిదాలు కడుతూండగా ఇంటి ఖర్చులు వెళ్లిపోతున్నాయి.

ఈ లోగా నాకో పాప పుట్టింది. పాపకు ఆర్నెల్లు వచ్చేసరికి మేము ఇంటివద్ద నుంచి మా అమ్మమ్మగారిని రప్పించుకున్నాము.

శ్రీమతికి కుట్టుపనులు, అల్లికలు, ఎంబ్రాయిడరీలు వగైరాలు బాగా వచ్చును. వాయిదాల పద్ధతి మీద ఒక కుట్టుమిషన్ కొని తను ఆడవాళ్లకూ, చిన్న పిల్లలకూ బట్టలు కుట్టడం ప్రారంభించింది. అందువల్ల ఆమె స్థాయి మామూలు మధ్యతరగతి గృహిణినుండి బట్టలుకుట్టే 'మనిషికి దిగజారిపోయింది. ఆమెకు చుట్టుపక్కల కాస్త గౌరవం తగ్గింది. దాని ప్రభావం మే మాట్టే ఫీలు కాలేదు. మా రిజర్వుడు నేచర్ అందుకు బాగా ఉపయోగపడింది.. మేము ఇతరుల అభిప్రాయాల గురించి పట్టించుకోకుండా మా పనులు మేము చేసుకుంటూ శ్రద్ధగా వ్యాపారం మీద దృష్టిని కేంద్రీకరించాము. ఈ పరిస్థితుల్లో కూడా మా వీరభద్రం పిల్లల పుట్టిన రోజులు మరచిపోలేదు. వాళ్లను సంవత్సరానికి రెండుసార్లు ఆహ్వానించడం మరచిపోలేదు. వాళ్ళు వీలున్నప్పుడల్లా మా ఇంటికి వచ్చి వెడుతూ మా మనోధైర్యాన్ని అభినందిస్తూండే వారు.

అయిదేళ్లలో నా వ్యాపారం బాగా నిలదొక్కుకుంది. ఈ మధ్యనే ఒక ఫ్యాన్సీ దుకాణం, బట్టల దుకాణం కూడా ప్రారంభించాను. శ్రీమతి ఇప్పుడు స్వయంగా బట్టలు కుట్టడం మానేసింది. ఊళ్లోని లేడీస్ టైలరింగ్ హౌస్‌ల్లో మాది కూడా ఒక ప్రముఖమైనది! పన్నెండు కుట్టుమిషన్లూ,ఇరవైమంది పనివాళ్లూ ఉన్నారు. ఎప్పుడూ ఆమెకు చేతినిండా పని ఉంటుంది.

ఆర్థికంగా మేమిప్పుడు బాగా బాగుపడిపోయాం. నే నద్దెకుంటున్న ఇల్లు అమ్మకానికి రాగా కొనేసి – ఆ స్థలంలోనే పెద్ద మేడ కట్టాను. మా వీధికి నా దొక్కటే దివ్యభవనం. నాకిప్పుడు రెండు కార్లున్నాయి. ఒక సామాన్యమైన గుమస్తా ఈ స్థాయికి



విడిపోతాడని నే నెన్నడూ అనుకోలేదు. ఆ కంపెనీలో ఉద్యోగం పోవడం నా మంచికే వచ్చింది.

ఇప్పుడు కూడా మేము వీరభద్రాన్ని సంవత్సరానికి రెండుసార్లు ఆహ్వానిస్తూనే ఉన్నాం. వాళ్ల పిల్లల పుట్టిన రోజులకు వాళ్లింటికి వెళ్లి వస్తూనే ఉన్నాం. కానీ క్రమంగా వీరభద్రం మా ఇంటికి రావడం బాగా తగ్గించేశాడు. ఇప్పుడైతే మేము పిల్చినపుడు తప్ప రావటంలేదు.

ఒకసారి వాళ్లింటి కెళ్లినపుడు "ఇప్పుడు మీరు రావడం బొత్తిగా తగ్గించేశారు మా ఇంటికి !" అన్నాను.

"మీ రొస్తున్నారా ?" అన్నాడు వీరభద్రం వెంటనే.

"మే మెప్పుడూ అంతే" అన్నాను నవ్వుతూ.

వీరభద్రం నవ్వలేదు– "ఒకప్పుడైతే మీ రెవరింటికీ వెళ్లేవారు కాదు. కానీ ఇప్పుడు చాలా మంది ఇళ్లకు వెడుతున్నారు. చాలా సార్లు వెడుతున్నారు. ఒక్క మా ఇంటికే రావడంలేదు."

వీరభద్రం ఆరోపణలో అబద్ధం లేదు. నేను కొంతమంది ఇళ్లకు చాలా తరచుగా వెళ్లి వస్తుంటాను. దానికి ఆహ్వానంతో నిమిత్తంలేదు. అయితే అవి వ్యాపారానికి సంబంధించిన అవసరం. నా వ్యాపారం సక్రమంగా నడిచి పోవడానికి నేను కొన్ని కంటాక్ట్సు మెయింటైన్ చేయక తప్పదు.

నేను నవ్వి–"మీ రన్నది అబద్ధం కాదు. అయితే ఆయా వ్యక్తుల ఇంటికి నేను కొన్ని ప్రయోజనాల నాశించి వెళ్లవలసి వస్తోంది. అది వ్యాపారం" అన్నాను.

"అదే మీలో వచ్చిన మార్పు–ప్రయోజన ముంటే తప్ప మీరు ఎవరింటికీ వెళ్లరు. ప్రయోజనం లేదు కాబట్టే నా ఇంటికి రారు" అన్నాడు వీరభద్రం.

నా నవ్వు చెదరలేదు – "మీరు చాలా తప్పుగా అర్థం చేసుకున్నారు. మీరు వ్యాపారానికీ, స్నేహానికీ ముడి పెడుతున్నారు. స్నేహానికి సంబంధించినంత వరకూ నే నేమీ మారలేదు. మీతో నాకున్నది స్నేహం మాత్రమే! వ్యాపారం కంటే ఎంతో విలువైనది. దాన్ని నేను వదులుకోలేను."

వీరభద్రం కన్విన్సయినట్లు లేదు కానీ సంభాషణ మార్చాడు. అక్కణ్ణించి బయటకు వచ్చాక శ్రీమతి నాతో చెప్పిందాన్ని బట్టి వీరభద్రం భార్య కూడా ఆమెతో అలాగే మాట్లాడింది. నాకు రవ్వంత బాధ కలిగింది.

మర్నాడు మేమేదో సినిమాకు వెళ్లి తలనొప్పి కొనుక్కుని – పోగొట్టు కోవడం కోసం శారదా హోటల్లో కాఫీ తాగడానికి వెళ్లాం. శారదా హోటల్ మా ఊరి కల్లా ఖరీదైనది. అక్కడి సర్వర్ రూపాయికి తక్కువైతే టిప్పు పుచ్చుకోరు. నలుగురికి సరిపడ్డ కాఫీ ఎనిమిది రూపాయలు. హోదాను నిలుపుకోవడానికీ, మరో చోట ఉండే అశుభ్రతను భరించలేకే మేము అక్కడే కాఫీ తీసుకుంటూంటాం.

శ్రీమతి కాఫీని చప్పరించి – "ఇది రంగనాధ్ విలాస్ కాఫీ క్లబ్‌లో కాఫీ లాగే ఉంది" అంది.

నే నుద్యోగం చేసేరోజుల్లో అది మా ఫేవరేట్ హోటల్. అక్కడి కాఫీకి చాలా పేరు.

నేను నవ్వి "హోటల్ మారినంత మాత్రాన–కాఫీ మారుతుందని ఎలా అనుకున్నావు. కాఫీని రంగనాధ్ విలాస్ కాఫీక్లబ్ కంటె బాగా తయారు చేయడం ఎవరి వల్లా కాదు. అసలు అక్కడి కాఫీయే ఇక్కడికి వస్తుందని చెప్పుకుంటారు."

అని ఉలిక్కిపడ్డాను. అక్కడైతే కప్పు కాఫీ నలభై పైసలు. ఇక్కడ రెండ్రూపాయలు. అదే కాఫీకి ధరలో ఇంత తేడా ఎలా వచ్చింది? ఖరీదైన పరిసరాలు, ఖరీదైన కప్పులు.

కాఫీని అడిగితే నేను మారలేదు అంటుంది. కానీ ప్రజలు నమ్ముతారా? ఈ భవనం, కాఫీ ధరించిన ఈ కప్పు– నమ్మనిస్తాయా?

నా విషయంలో కూడా ఇంతే జరిగిందేమో! నా ఖరీదైన దుస్తులు, నాకున్న సదుపాయాలు చూసి వీరభద్రం భ్రమలోపడి నేను మారాననుకుంటున్నాడు ఒకప్పుడు నా కంటే ఎక్కువ హోదాలో ఉండేవాడుకాబట్టే నా ప్రవర్తన ఆయనలో ఎటువంటి అనుమానాల్నీ కలిగించలేదు. నేనాయన్ను చిన్న బుచ్చగలనని సందేహించలేదు ఇప్పుడు నాకు అబ్బిన ఐశ్వర్యం మా ఇద్దరికీ మధ్య ఆర్థిక వ్యత్యాసాన్ని బాగా పెంచి– ఆయన్ని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుకు గురి చేసింది. ఒకప్పుడు నా ప్రవర్తనను సహజ స్వభావంగా భావించగలిగిన ఆయన ఇప్పుడు దాన్ని తన పట్ల అలక్ష్యంగా భావించి బాధపడుతున్నాడు.

నేను ఫైవ్‌స్టార్ హోటల్లో కాఫీలాంటి వాణ్ణే. పాకహోటల్ కాఫీకి దానికీ రుచిలో చెప్పుకోతగ్గ తేడా ఉండదని నేనొప్పుకుంటాను. కానీ వీరభద్రం ఒప్పుకోడు. పరిసరాలు సృష్టించిన భ్రమలోపడి వీరభద్రం లాంటి వారెందరో స్నేహపురుచిని కోల్పోతున్నారు.

అంతరంగికంగా నేను మారలేదన్న నిజం నాకు తృప్తిని కలిగించినా, వీరభద్రంలో మార్పు వచ్చినందుకు నా కెంతో బాధ కలిగించింది. ●


వెలువడింది!
మీ అభిమాన రచయిత్రి శ్రీమతి హాజరా అపూర్వ సృష్టి
మరచిపోలేని సంఘటనలు, మనసుని కదిలించే సంభాషణలు—ఇది నవల కాదు ! ఒక నిండు జీవితం !
అని స్ఫురించేంత వాస్తవంగా వ్రాసిన ఈ నవల—పుస్తక ప్రపంచంలో విరిసిన మరో పారిజాతం !
తప్పక చదవండి ! తార రు. 18-00
పుస్తకం వెలలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే ఆ రూపాయికి V.P.P.లో పంపుతాము.
శ్రీ కవితా పబ్లికేషన్స్, విజయవాడ-2.